

"ఆలా ఉన్నారేం?"

"ఎలా ఉన్నాను?"

"మీ కిలా రావడం ఇష్టం లేదు కదూ?"

"ఇష్టం లేకపోవడమేం? నీ ఇష్టంకన్నా వేరే ఇష్టం నాకేముంటుంది, నీరూ?" కృష్ణ ఆప్యాయంగా టేబిల్ మీద నీరజ చేతిని నిమిరాడు.

ఏమో? మొదటనేను ఇలా వద్దామన్నప్పుడే వద్దన్నారు మీరు. ఆ తర్వాతనైనా ఏదో నాకోసం వస్తున్నట్టు అనిపిస్తోంది నాకు!" నీరజ తల దించుకుని సగం వేళాకోళంగా, సగం గంభీరంగా అంది.

"ఈ వారం రోజులకోసం ఎంత ఆశతో ఎన్నాళ్ళనుంచి ఎదురుచూశానో తెలియదు నీకు! తెలిసినా తెలియనట్టు నటిస్తున్నావేమో! నీరూ, ఎలా చెప్పను? ఎన్ని మాటల్లో చెప్పితే నీకు నమ్మకం కలుగుతుంది, చెప్పు?"

"సారీ, మీరు సీరియస్‌గా తీసుకుంటారనుకోలేదు." నీరజ అతని కళ్ళలోకి ఒకసారి చూసి దించుకుంది.

"ఈ రోజుల్లో నా కేమిటో ప్రతిక్షణం పరీక్షలాగే ఉంటోంది. ఈ ఉద్వేగం, కలవరం అంతా ఇదొక గమ్మత్తయిన అనుభవం!"

"మీకే కాదు నాకూను. కాని, ఇందులో ఏదో థ్రిల్—చెప్పలేని హాయి ఉందికదూ?" కొద్దిగా సిగ్గుపడింది నీరజ.

మల్లేపల్లి స్టాండులో నాలుగు రోడ్ల కలయిక దగ్గర, టీ స్టాలు బయట కూర్చొని ఆరు గంటలవేళ మాట్లాడుకుంటూంటే వాళ్ళిద్దరికీ

**మనిషి మీద, మనిషి ప్రయత్నం మీద నమ్మకం ఉండడంలో విశేషం లేదు. మనిషి అయినవాడికి, ఆత్మ విశ్వాసం ఉన్నవాడికి అది సహజం. ప్రయత్నానికి పరిస్థితులు కూడా అనుకూలిస్తాయి. ఫలితం అనుభవానికి రాబోయే క్షణంలో మాత్రం అంతా తారుమారు అవుతుంది. చిత్రమే కాని అది జీవితం, మరి!**

అదే ఆనందపు టంచులాగ ఉంది. తక్కిన మూడు రోడ్లమీద బస్సులు లేవు. ఆ నాలుగు రోడ్లు కూడలి చుట్టూ నాలుగయిదు పాకలు తప్పిస్తే ఊరేదీ పెద్దగా ఉన్నట్టు కనబడదు. రోడ్డుకు రెండువైపులా తుమ్మచెట్లు మినహా కొన్ని మైళ్ళ కైవారంలో ఎక్కడా చెట్టూ చేమా లేదు. దూరాన రాళ్ళు పేర్చినట్టున్న కొండలు; ఆకాశంలో నీరెండల కాంతులు. అదొక అద్భుతమయిన సాయంకాలం.

అక్కడ డీలక్స్ బస్ అర్ధగంట ఆగుతుంది. ఆగవలసింది అయిదు నిమిషాలే అయినా, హైదరాబాదునుంచి అరవై మైళ్ళూ రెండుగంటల లోపలే లాగించేసి, మళ్ళీ టైమయ్యేదాకా అక్కడే పడేసి ఉంచుతాడు. రెండు గంటలు బిగుసుకుపోయి కూలబడి బస్ కుదుపుకి నలిగిపోయిన ప్రయాణీకులకు అదొక విధంగా విశ్రాంతి కూడా.

మరో పది నిమిషాలకు బస్ బయల్దేరింది. చీకటి తెరలు క్రమంగా దిగుతూంటే కొండల మధ్య బస్ దూసుకుపోతూంది. ఎత్తైన వాలు దిండ్లకు జేరగిలి ఒకరిపక్కన ఒకరు కూర్చొని, దూరాన ఆకాశంమీద కొండలు గీతలు గీసేచోట అదే పనిగా చూస్తూ ఊహ అల్లుకుంటూంటే— ఆ బస్‌లో అలా జీవితకాలమంతా వేలకొద్దీ మైళ్ళు ఎక్కడా ఆగకుండా ప్రయాణిస్తూంటే ఎంతో బాగున్నానిపిస్తూంది.

రెండేళ్ళ స్నేహానికి పరాకాష్ఠ లాంటిది ఆ వారం రోజుల సాన్నిహిత్యం. ఈ వారం రోజుల కోసం సుమారు ఏడాదినుంచి ఎంతో ఆత్రుతగా ఎదురు చూశారిద్దరూ. తీరా కలిశాక మాటలు దొరకడంలేదు. కాని ఆ మూగతనంలోనే ఎన్నో వేల మాటలకందని అనుభూతి దాగున్నట్టుంది.

రెండేళ్ళక్రితం. ఉష పెళ్ళి వైభవంగా జరుగుతున్న సమయం. ఉష, నీరజకు ఎక్కడో మైలుదూరాన బంధువేకాకుండా ఉత్తరాలు. పెళ్ళికి వచ్చిన మర్నాడు నీరజ, కృష్ణమూర్తిని చూసింది. పచ్చగా, పొడుగ్గా, సన్నగా, ఎప్పుడూ నవ్వే మొగంతో ఎవరైనా ఇట్టే ఆకర్షిస్తాడు కృష్ణ.

"ఎవరే అతను?" కొంచెం బింకంగా అడిగింది ఉషను.

"తొందరపడకు! వెళ్ళేలోపల తెలుసుకోక పోవులే!" కొంటెగా అంది ఉష.

ఆ తర్వాత రెండు రోజులకు సాయంకాలం గార్డెన్ పార్టీలో స్నేహితులందరూ కలిసి స్వేచ్ఛగా కబుర్లు చెప్పుకునే సమయంలో—

"మిస్ నీరజ, ఫైనల్ ఎమ్. ఏ." ఉష పరిచయం చేసింది కృష్ణమూర్తికి.

"కృష్ణమూర్తి—ఎ వర్షిపర్ ఆఫ్ బ్యూటీ!" కృష్ణమూర్తి తనను తానే పరిచయం చేసుకున్నాడు చిన్నగా నవ్వుతూ.

"మావాడు గేయాలు, కథలు వ్రాసేవాడు; ఉపన్యాస లివ్వగలడు. ఒకసారి నాటకం కూడా ఆడాడు. కాలేజిలో ప్రిన్స్ ఛార్మింగ్ అని మారు పేరు!" రావూరావు, కృష్ణమూర్తి బుజంమీద చెయ్యేసి చేర్చాడు.

నీరజ అదోలా అయి తల దించుకుంది. ఆ తర్వాత ఒకటి రెండు రోజుల్లోనూ కృష్ణమూర్తి ఇదివరకటికన్నా ఎక్కువ అందంగా కనిపించాడు.

తిరిగి గుంటూరు వెళ్ళిపోయాక కూడా అతని నవ్వే కళ్ళు, చమత్కారంగా పలికే మాటలు వెంటాడుతూనే ఉన్నాయి. ఉద్యోగం, చదువు వెలిబుచ్చుకోకుండా నాజూగ్గా సౌందర్యారాధకుణ్ణని చెప్పుకోడంలో కేవలం చమత్కారమే కాకుండా పరోక్షంగా తన అందాన్ని పొగిడినట్టనిపించింది. కాని, అది నిజమా? తను అతన్ని కదిలించగలిగిందా?

ఆ విషయంలో రుజువు చాలా కొద్ది రోజుల్లోనే దొరికింది. ఒక సాయంకాలం అందిన నీలిరంగు కవరు ఎన్ని పందలసార్లు చదివిందో గుర్తులేదు.

"ఈ ఉత్తరం అందుకున్న సమయంలో మీరే మూడ్‌లో ఉంటారో తెలియదు. కాని, దీన్ని మీకు పంపిన మరుక్షణంనుంచీ జవాబుకు ఎదురుచూసే నాకు, మీనుంచి నాలుగు మాటలు ఎంతో ఆనందాన్నిస్తాయో తెలియపరచగలిగితే దీని ఆశయం నెరవేరినట్టే!" ముచ్చటగా మూడు వాక్యాలు! అలా మొదలైంది పరిచయం.

అలాంటి ఉత్తరాల్ని ఆమె ఎన్నడూ ఎరగదు. ఎదురుగా కూర్చొని మాట్లాడుతున్నట్టు, అతి చనువుగా, తనే ఎరగని తనలో లోపలి మారుమూలల్ని తాకి చెబుతున్నట్టు తోపించే ఆ ఉత్తరాలు ఆమెను అతనికి చాలా చేరువగా చేర్చినాయి. అతనికి తల్లి, తండ్రి లేరు. అన్న ఒకరున్నా అతని ఇష్టాయిష్టాలకు అడ్డులేదు. నీరజ తండ్రి ఆమె మాట కాదనే మనిషి కాదు.

"ఒక్క పది రోజులు సెలవుపెట్టి రాగూడదూ? ఏదన్నా, అందమైన చోటికి—ఎక్కడికైనాసరే, నీ యిష్టం—ఈ పనులు, రొటీన్, గోల, గందరగోళంనుంచి కొన్నాళ్ళు దూరంగా ఎక్కడికో, మనకు మనమే, మాట్లాడుకుంటూ, ఏం మాట్లాడకుండా ఒకర్నొకరు చూసుకుంటూ, కలలుగంటూ!—ఎంత బాగుంటుంది!"

చాలా బాగుంటుం దనిపించిం దామెకు. పైగా, ఇద్దరి జీవితాలు శాశ్వతంగా ముడిపడబోయేముందు ఒకర్నొకరు మరింతగా తెలుసుకోడానికి ఇదొక అద్భుతమయిన అవకాశం.

**డి. కామేశ్వరి**

ఎనిమిది కాబోతుంటే బస్ ప్రాజెక్ట్‌హౌస్ చేరింది. హిల్ కాలనీ పైనుంచి కిందికి చూస్తే దిగంతంలో కలిసిపోతూ ఎటు చూచినా వేలకొద్దీ దీపాలు! వంకరలు తిరిగే రోడ్లవెంబడి, డామ్ మీద, బ్రిడ్జి పొడుగునా కాంతుల తోరణాలు. పైలాన్, వర్క్‌షాప్, మెషినరీ యార్డ్స్, సైలోస్, బ్రిడ్జి, బ్లావాక్సు, రెస్ట్‌హౌస్ అన్నీ రాత్రి చీకట్లమధ్య దీపాల వెలుగులో మరింత అందంగా కనబడుతున్నాయి.


తొమ్మిది గంటలవేళ బస్ ఆగింది. కృష్ణ ఆత్రుతగా క్రిందికి చూసి, తృప్తిగా పలకరించాడు రాజును. అతనిలో ఉన్నట్టుండి గమ్మత్తయిన మార్పు కనిపించింది నీరజకు. అంతవరకూ ఉన్న మౌనమంతా కరిగిపోయి, మామూలుకన్నా ఎక్కువగా నవ్వుతూ తేలిగ్గా మాట్లాడసాగాడు.

కృష్ణమూర్తి, రాజు ఏవో పాత కబుర్లు మాట్లాడుకుంటూంటే కూలీ సూట్‌కేస్, ఎటాచి వగైరా జీపులో పెట్టాడు. నీరజకంతా అదోలా కొత్తగా ఉంది. వాళ్ళిద్దర్నీ రెస్ట్‌హౌస్‌లో దిగబెట్టాక కాసేపు కబుర్లు చెప్పి వెళ్ళిపోయాడు రాజు.

రెస్ట్‌హౌస్ వెనక స్టెప్డ్ లాన్స్‌లో దిగువన పేం సోఫాల్లో వాలి, అటు డామ్, ఇటు బ్రిడ్జి, మధ్యన పలచగా నల్లగా రాళ్ళమధ్య దొర్లే కృష్ణ, చుట్టూ కొండలు, పైన విదియ చంద్రుడు, నక్షత్రాలు—అద్భుతమైన అంతటి అందాన్ని చూడకుండా అనుభవించకుండా అంత కాలం ఎలా ఉండగలిగామా అని ఆశ్చర్యం వేసింది ఇద్దరికీ. అలా కూర్చొని ఏవో పిచ్చిగా మాట్లాడుకుంటూంటే తెలియకుండా గంటలు గడిచిపోతాయి. తనకన్నా అదృష్టవంతురాలు ఈ ప్రపంచంలో ఉండదనుకొంది నీరజ. అలాంటి ఒక్క రోజు కోసం ఎన్నేళ్ళు తపస్సు చెయ్యాలో! మళ్ళీ ఆ రోజు జీవితంలో వస్తుందన్న నమ్మకంలేదు. ఆమె జీవితానికి ఆదర్శం, గమ్యం ఆ ఒక్కనాటి అనుభూతి అనిపించింది. ఆ అనుభూతి కలిగించిన కృష్ణకు ఆమె లోలోపల ఎంతగానో కృతజ్ఞత చెప్పుకొంది. తన కలలు పండి కృష్ణ తనవాడైతే తనకంతన్నా కావలసింది లేదు.

మర్నాడు తొమ్మిది గంటలవేళ రాజు జీపు పంపించాడు. కృష్ణ డ్రైవ్ చేస్తుంటే నీరజ పక్కన కూర్చొంది.

జీపు మొదట, డామ్ కుడివైపుకి మళ్ళీ కాఫర్ డామ్‌మీద ఆగింది. నూరు అడుగులు పైగా లేచిన గోడపక్కన నిలబడి గోడ నానుకొన్న అరల్లాంటి కర్ర స్కెఫోల్డింగ్ చూస్తుంటే స్వర్గ



**ఆనందమైన ఆటసమయం - వుడ్‌వార్డ్స్ వల్లనే**

కడుపునొప్పి, పుల్లదనం, కడుపు ఉబ్బరం, పళ్లుచేయునపుడు కలిగే జబ్బులకు, వాడేది వుడ్‌వార్డ్స్' గ్రైప్ వాటర్

**తెలివైన తల్లులు 100 ఏళ్ల నుంచి వాడుచున్నారు.**




Aiyars ATC-486-TEl

# క్షంతవ్యులు

నికి నిచ్చెన లాగుంది. అదొక మహా యంత్రం. ఆ యంత్రంలో చిన్న చిన్న మరలు మేకులు లాగ వేలకొద్దీ మగవాళ్ళు, ఆడవాళ్ళు, పిల్లలు, అక్షరాలు రానివాళ్ళు, పెద్ద పెద్ద ఇంజనీర్లు ఎందరో! రాళ్ళ పోగులు, లారీలు, జీపులు, మోర్టారు గమేలాలు నెత్తిన పెట్టుకుని నెర్రిగా అరుస్తూ కదిలిపోయే కార్మికులు, వాళ్ళను గదిమేవాళ్ళు, ఇవేవీ పట్టనట్టు నిర్లిప్తంగా వేగంగా నురగలు కక్కుతూ బండలమీద దొర్లి పోయే కృష్ణ—ఈ హడావిడి, గందరగోళం అంతనూ దిగ్భ్రాంతితో చూస్తూ నిలబడి పోయింది నీరజ. డామ్ అంటే అంత బ్రహ్మాండ మైన కృషి, యత్నం ఉంటుందన్న ఆలోచన ఆమెకు ఎన్నడూ రాలేదు. ఆమె చూసినది ఆమె అంచనాలకు ఎన్నో వేల రెట్లు ఎక్కువ. అందుకే కృష్ణ చెప్పేదేదీ ఆమె మనసులో కెక్కడం లేదు.

జీపు ఎడంవైపుకి వచ్చింది. అంతమంది మనుషులు లేకపోయినా, ఆ పనినే క్రేన్లు, మోనో టవర్లు చేస్తున్నాయి. ట్యాంకులనుంచి తోకో మోర్టారును, బకెట్లలో సైటుకు చేరేస్తే, క్రేను అలా నిమిషాల్లో డామ్‌పైన దిమ్మరిస్తుంది. అదే దృశ్యాన్ని వ్యూ పాయింటు నుంచి చూస్తే అదో తమాషా. మనుషులు, మరలు అన్నీ లిల్లీ పుట్లలాగ కనిపిస్తుంటే, వాళ్ళ హడావిడి, అలజడి, కదలిక అంతా అదొకమాదిరి వేదాంతాన్ని పుట్టిస్తున్నాయి.

పైలాన్ దగ్గర జీపు ఆపుచేసి డామ్ మోడల్ దగ్గరికి తీసుకువెళ్ళాడు కృష్ణ. పైనుంచి చూస్తే మూడు కొండ శిఖరాలమీద మూడు వృత్తాకారాల్లో ఉంటాయి మూడు కాలనీలు. అటూ ఇటూ కాలవలు, అవి పోయే సొరంగాలు మొత్తం ప్రాజెక్ట్‌ను సూక్ష్మంగా అర్థం చేసుకో వచ్చు.

"నమస్కారం!" వాళ్ళిద్దరూ మోడల్ బయటికి వస్తూంటే ఒకామె నవ్వుతూ పలక రించింది కృష్ణను.

కృష్ణ వెంటనే జవాబివ్వలేదు. నీరజ అతని మొగంలోకి చూసింది. అతను, మొగం చిట్లించి ఒక్కక్షణం క్రిందికి చూసి, తర్వాత అదోలా నవ్వి, "నమస్కారం" అన్నాడు.

"జ్ఞాపక మున్నామా?"

"లేకేం? తావు?"

"ఏమోలెండి! ఇప్పుడు మాకు దూరంగా పెద్ద పదవుల్లోకి వెళ్ళిపోతే, ఇంక మేం గుర్తుండ మనుకున్నాను."

కృష్ణ మాట్లాడలేదు. కొద్ది క్షణాలు గడిచిపోయాయి. నీరజ ఆమెవంక పరిశీలనగా చూసింది. చామనచాయ రంగు, మొగంనిండా మరీ ఎక్కువగా అద్దిన పౌడరు. జ్యోతిలా దిద్దిన

బొట్టుకింద మరో చుక్క. కాటుక కళ్ళు. నల్లటి పెదాలు. నిద్ర నెరగనట్టున్న చూపులు; వదులుగా మధ్య నొకచోట రిబ్బనుతో బిగించి వదిలేసిన జుట్టు, సన్నగా, పొడుగ్గా ఉందామె. ఆ బట్టలు, వేషం ఫ్లాషీగా కనిపిస్తున్నాయి.

''ఆమెని నాకు పరిచయం చెయ్యరేం? శ్రీమతా?'' అదోలా నవ్వి అడిగిం దామె.

''డాక్టర్ నీరజ.'' పరధ్యానంగా అన్నాడు కృష్ణ.

''సుశీల.'' ఆమె తనను తానే పరిచయం చేసుకుంది.

మాటలు జరగడం చాలా కష్టంగా ఉంది.

''ఎక్కడ దిగారు?''

''రివర్ వ్యూలో.''

''హనీమూనా?''

''అలాంటిదే!''

నీరజ కీ సంభాషణ ధోరణి నచ్చడంలేదు. ప్రశాంతమయిన సరస్సులో రాయి విసిరినట్టుంది. అక్కడినుంచి వెళ్ళిపోడానికి దారి ఏదా అన్న ఆలోచన ఒక్కటే ఆమె మెదడులో చోటు చేసుకుంది.

''తర్వాత కలుసుకుంటాను.'' నీరజవంక మరోసారి సంభ్రమంగా చూసి నవ్వి వెళ్ళిపోయింది సుశీల.

జీపు నడుపుతున్న కృష్ణ ఏం మాట్లాడ్డంలేదు. ఏం మాట్లాడినా వినే ధోరణిలో లేదు నీరజ. ఇద్దరిలోనూ ఏవేవో ఆలోచనలు ముసురుకుంటున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంటవేళ తిరిగి వచ్చా రిద్దరూ. లాయీ అమర్చిన వేడి లంచ్ ముగించాక ఇద్దరూ వేరిగదుల్లో వాళ్ళు నిద్రపోయారు.

ఆ రోజు నీరజ ఎంతో చూసింది. సాధారణంగా ఏదన్నా చూద్దామని కుతూహలంతో వెళ్ళినప్పుడు అంచనాలు మరీ ఎక్కువనిపించి నిరాశ మిగులుతుంది. కాని, ఈ ఒక్క విషయంలో మాత్రం అంచనాలు చాలా తక్కువనిపిస్తాయి. అసలు డామ్ చూడనివాళ్ళకు అక్కడ అన్ని వేలమంది ఉన్నారని, అదొక పెద్ద ఊరు అన్న సంగతే తట్టడం కష్టం. కృష్ణను బలవంతపెట్ట అక్కడికి వచ్చినందుకు తనను తానే అభినందించుకొంది నీరజ. ఆ ఆలోచనల్లో ఎప్పుడు నిద్ర పట్టిందో, ఎంతసేపు నిద్రపోయిందో తెలియదు.

''లేరని చెబ్తాంటే అర్థం కాదూ?''

''మూడు గంటలకే ఎక్కడికి వెళ్ళారు?''

''అదంతా నీ కనవసరం.''

''నాకు చాలా అవసరం.''

''నాకేం తెలియదు. లేరు. అంతే.''

''లేరని చెప్పమన్నారా?''

''అతిగా మాట్లాడక, వెళ్ళిపో.''

''నువ్వెవడివోయ్, మధ్యన? ఆయన తిరిగి వచ్చేదాకా ఇక్కడే కూర్చుంటాను.''

''ఇదుగో, చూడు. మర్యాదగా వెళ్ళు. లేకపోతే తర్వాత కష్టపడతావు.''

మొదట్లో ఎక్కడో కలలోలాగ, తర్వాత మెల్లిగా దగ్గరగా స్పష్టంగా వినబడసాగాయి. చటుక్కున లేచి బయటికి వచ్చింది నీరజ.

ముందు వరండాలో టెలిఫోన్ స్టాండ్ పక్కన పేము కుర్చీలో కూర్చొనుంది సుశీల. పక్కగా నిలబడి మాట్లాడుతున్న సుందరరావు, నీరజను చూడగానే తడబడి దూరంగా నడిచాడు.

సుశీల లేచి నిలబడి నవ్వుతూ చూసింది. ప్రొద్దుటికన్నా ఎక్కువగా తయారయి ఉంది. అంతకన్నా ఎక్కువగా అయిష్టం కలిగింది నీరజకు.

''కూర్చోండి. ఏం వచ్చారు?'' అడిగింది నీరజ కూర్చుంటూ.

''వారితో మాట్లాడదామని వచ్చాను.''

''నిద్రపోతున్నారు.''

సుశీల, సుందర్రావుకేసి చూసింది. సుందర్రావు అయోమయంగా చూసి తల దించుకున్నాడు.

''ఏదన్నా ముఖ్యమైన పనా?'' నీరజ అడిగింది.

''అబ్బే! కాదులెండి. ఉత్తినే కనబడిపోదామని వచ్చాను.''

''లేపనా?''

''వద్దులెండి. మళ్ళా వస్తాను.'' కాసేపు తటపటాయించి లేచి వెళ్ళిపోయింది సుశీల.

''లేరని ఎందుకు చెప్పావ్?'' నీరజ అడిగింది సుందర్రావును.

''అలా చెప్పమన్నారండీ.'' నవ్వలేక నవ్వాడతను.

నీరజ లోపలికి వెళ్ళిపోయింది. ఆమె ఎంత మరిచిపోవాలన్నా సుశీల, ఆమె గాడీవేషం నీడలా వెంటాడుతూనే ఉన్నాయి.

సాయంకాలం అయిదు గంటలవేళ మధ్య హాల్లో సోఫామీద వాలి టీ సిప్ చేస్తున్నప్పుడు కృష్ణ తెచ్చిపెట్టుకున్న నవ్వుతో వింతగా మాట్లాడుతున్నట్లు అనిపించింది నీరజకు. అయితే, ఆమెలో అలుముకున్న ఆలోచనలు అలా తోపింప జేస్తున్నాయో, నిజంగా అతనలా ఇబ్బంది పడుతున్నాడో ఆమె తేల్చుకోలేకపోయింది. మాట లేవో మామూలుగా జరిగిపోతున్నాయి. కాని, వాటి వెనక ఇదివరకటిలా మనస్సు పూర్తిగా లగ్నమౌతున్నట్టు లేదు. అంతకన్నా దారుణం, అలా మోసపుచ్చుకుంటున్నట్టు ఇద్దరికీ తెలిసిపోవడం!

భోజనం ముగిశాక మామూలుగా క్రిందిలాన్‌లో పేం కుర్చీల్లో వాలి ఇద్దరూ మాట్లాడుకుంటూంటే, అప్పుడే ఒక రోజు గడిచిపోయిందన్న బాధ ఇద్దర్నీ వేధిస్తోంది.

''మనమంతా ఎప్పుడో అప్పుడు తప్పులు చేస్తాంకదూ?'' ఏదో మాటల సందర్భంలో చాలా మామూలుగా చేర్చాడు కృష్ణ.

''తప్పులు చెయ్యకపోతే మనం మనుష్యులమే కామేమో!''

''బాగా చెప్పావు! చేసిన తప్పుకి పశ్చాత్తాప పడ్డంకన్నా పెద్ద శిక్ష వేరే ఉండదేమో?''

నీరజ మాట్లాడలేదు.

''చేసిన తప్పు ఒప్పుకొని క్షమించమంటే దేవుడు శిక్షనుంచి తప్పిస్తాడని కొంతమందికి గట్టి నమ్మకం!''

''దేవుడి మీదికి పోతూందేం మనసు?'' నీరజ నవ్వింది.

''ఏమీలేదు....ఊరికినే! ఇలా పిచ్చిగా ఏవేవిటో మాట్లాడుకుంటూంటే ఎంతబాగుంది!'' మొదట కొంచెం తడబడినా, నెమ్మదిగా కుదుటబడి నవ్వేశాడు కృష్ణ.

ఆ రాత్రి మాటలు మామూలు ధోరణిలోనే గడిచిపోయాయి. నిద్రపోయేముందు నీరజకు ప్రొద్దున్న డామ్‌కుడివైపు చూపినజనసముద్రం, ఆ గోల, గందరగోళం మాత్రమే కళ్ళెదుట కట్టాయి. అక్కడ పనిచేసే వాళ్ళు ఎంత అదృష్టవంతులో అనిపించింది. ఆ తర్వాత ఎప్పుడో నిద్ర పట్టింది.

మర్నాడు ఎత్తిపోతలకు ప్రోగ్రాం వేశా



అస్కారం లేకున్నా
అశలు తిని బ్రతుకువాడు
చిత్రం—ప్రేమచంద్ర గోస్వామి (జైపూర్)

రిద్దరూ. జీపు గేటు దాటేవేళ కృష్ణ ఆకస్మాత్తుగా బ్రేక్ నొక్కడంతో ఉలిక్కిపడి పక్కకు చూసింది నీరజ.

సుశీల ముందునుంచి పక్కకు తొలిగి నవ్వుతూ నమస్కారం చేసింది. అదే ఆకారం!

కృష్ణ ఆమెను చూడనట్టు వేగంగా పోనిచ్చాడు. మెలికలు తిరిగిన రోడ్డు వెంబడి ఆ కొండ దిగి, మరో కొండపైకి ఎక్కింది జీపు. రోడ్డుకు రెండు వైపులా కొండ వాలుల్లో దట్టంగా మొలచిన చెట్లు, పాముపుట్టలు, నల్ల రాళ్ళ గుట్టలు, అప్పుడప్పుడు ఎదురువచ్చే బస్సులు, లారీలు తప్పిస్తే, ఎక్కడా మనుష్య సంచారం లేదు.

జీపు తారోడ్డు దిగి కచ్చారోడ్డు పట్టింది. రెండు మైళ్ళు పోయాక బంగళాముందు ఆగారు.

(తరువాయి 61 వ పేజీలో)

# క్షంతవ్యోలు

(21 వ పేజీ తరువాయి)

కొండ అంచున రెస్టుహౌస్. కింద సుమారు వంద అడుగుల లోతున అగాధం. దాన్నిండా డొంకలు, తుప్పలు, ఎదురుగా పక్కన రాళ్ళ అంచున క్రిందికి జారే నీళ్ళజారు. దిగువన సన్నటి లోయ. లోయనిండా మొగలి డొంకలు, రకరకాల చెట్లు అలుముకుపోయి ఎక్కడా నేల కనిపించదు.

రెస్టుహౌస్ వెనక రాళ్ళ అంచున నిలబడి క్రింద డొంకలోకి చూస్తున్నా రిద్దరూ. అంత వరకూ ఇద్దరిలోనూ ఏదో గడ్డ పేరుకున్నట్లు మాటలు జరగడం లేదు. ఎదురుగా కొండవంచన మెట్లమీద నీరుజారి తుంపరల్లా తెల్లగా చుట్టూ చిందుతూంటే వాటిమీద ఇంద్ర ధనుస్సులు విరుగుతున్నాయి.

"ఆమె మీ కోసం వచ్చింది. ఆపలేదేం?" నీరజ క్రిందికి చూస్తూ అడిగింది.

"ఎవరు?" కృష్ణ తెల్లబోయినట్లు తెలిసి పోతూంది.

"సుశీల. నిన్న మీరు నిద్రపోతున్నప్పుడు ఒకసారి వచ్చింది!"

"లేనని చెప్పమన్నాను."

"అలాగే చెప్పా డతను. కాని కదల్లేదు. చివరికి నేను వెళ్ళి నిజం చెప్పాక, ఏ మనుకుందో వెళ్ళి పోయింది."

కృష్ణ మాట్లాడలేదు. ఇద్దరూ యాంత్రికంగా వరండాలోకి నడిచారు. అతను ఫ్లాస్కు తీసి కాఫీ రెండు కప్పుల్లోనూ పోశాడు. ఆమె అతనికి ఓ కప్పు అందిచ్చింది.

"నిన్న రాత్రే చెప్పాలనుకున్నాను. కాని,ఎందుకో శక్తి చాలలేదు. ఇప్పు డింక తప్పదు." కృష్ణ కాఫీ పూర్తిచేసి మొదలు పెట్టాడు.

"నేను చెప్పేది దయచేసి అడ్డు చెప్పకుండా విను, నీరూ!నన్నర్థం చేసుకోడానికి ప్రయత్నించు. ప్లీజ్..... నీ శాయశక్తులా ప్రయత్నించి నన్నర్థం చేసుకుంటానని మాటివ్వు!"

"నే నర్థం చేసుకోలేనని అనుమాన మెందుకు కలగాలి మీకు?" నీరజ నవ్వింది.

"నువ్వర్థం చేసుకోలేవని కాదనుకో.... కాని ఏమిటో నా బాధ నాది."

కృష్ణ తాపీగా సర్దుకొని మొదలుపెట్టాడు.

అయిదేళ్ళ క్రితం అత నా ఊరిలో పనిచేశాడు. ఒక్కడు, చక్కగా అన్ని సదుపాయాలూ ఉన్న మూడు గదుల ఇల్లు, చుట్టూ అందమైన పూల తోట, ఇంట్లో అన్నీ అమర్చి పెట్టడానికి నౌకరు, మంచి పలుకుబడి, గౌరవం, అన్నిటికన్నా ముఖ్యం అవసరాలకు మించిన జీతం. ఆ జీవితం ఎంతో అందంగా ఉండేది. అయిదు గంటలదాకా ఆఫీసు, ఆ తర్వాత క్లబ్బు, కాసేపు పేకాట, తర్వాత ఇల్లు, పుస్తక పఠనం, నిద్ర.

ఆ దినచర్య కాగితాలమీద చదువుకోడానికి బాగానే ఉంటుంది. కాని, రోజులు గడిచిన కొద్దీ ఆ బ్రతుకొక గానుగలా తయారయింది. రోజూ ఒకేరకం మనుష్యులు,ఒకటే పని,ఒకటేంగా టీన్— దానితో చికాకు, విసుగు ఎక్కువయేవి. దానికి తగ్గట్టు పనికన్నా తీరిక ఎక్కువ కావడంతో ఆలోచనలు విపరీతంగా పనిచేసి చాలాదూరం పోయేవి. రోజూ చదివే పుస్తకాలు, పేపరు చూడాలన్నా విసుగు, ఏవగింపు, అసహ్యం. మనసు కొత్తదనం కోసం వెర్రిగా మథనపడ సాగింది. సెలవుపెట్టి ఎక్కడికన్నా వెళ్ళిపోవాలని, ఉద్యోగం మార్చాలని, కనీసం ట్రాన్స్‌ఫర్ తెచ్చుకోవాలని ఏమేమిటో అనిపించేది. రోజులు గడిచిన కొద్దీ ఆ బ్రతుకు మరీ భారమైంది.

తనకు అన్నీ ఉన్నాయి. కాని, ఏదో లేదు. ఆ లేనిదే చాలా అవసరం. ముఖ్యం. అదేమిటో తనకు స్పష్టంగా తెలియదు. తన కేది కావాలో తనకు తెలియనప్పుడు ఆ భావం కలిగించే దైన్యం, విచారం భరించలేనివి.

రాత్రులకు రాత్రులు అలా ఒక్కడూ తోటలో కూర్చుని పైన చుక్కల్ని, సోమరిగా కదిలే మబ్బు తునకల్ని చూస్తూంటే గంటలు తెలియకుండా గడిచిపోయేవి. చుట్టూ ఇళ్ళలో సంసారులు చల్లగా ఆరు గంటలకు అన్నీ పూర్తిచేసి ఏడయే సరికి మంచా లెక్కేస్తారు. తనకు నిద్ర రాదు. ఏమేమిటో ఆలోచనలు! తలా తోకా ఉండదు. ఒక్కోసారి అలా ఆలోచనల్లో మునిగిపోడమే అద్భుతమైన ఆనందం అనిపిస్తుంది. కాని, ఒక్కొక్కప్పుడు ఈ ఊహా విహారాలంటే విపరీతమైన ఏవగింపు! చెప్పలేని బాధ! అంతు తెలియకుండా వేధించే అశాంతి!

మిగతా అందరూ తనంటే అసూయ పడ్డట్టు కనబడతారు! తన స్వేచ్ఛ, తన చదువు, ఉద్యోగం, జీతం, పలుకుబడి— అన్నీ చుట్టూ ఉన్నవాళ్ళలో చాలామంది కన్నా ఒక మెట్టు ఎక్కువ. తనకు అన్నీ ఉన్నట్టు వాళ్ళ భావం.

కాని, తను? తనకు తానే ఒక శత్రువు! తనలో రోజురోజుకూ ఎక్కువయ్యే శూన్యాన్ని ఎవరో పదేపదే తట్టి గుర్తు చేస్తున్నట్టుంటుంది. ఈ అలజడి, అశాంతి రకరకాల సమయాల్లో రకరకాల రూపాలు దాల్చేవి. ఎదుటి మనిషికి చెప్పుకోలేని ఈ బాధ రానురాను ఒకమాదిరి భయంగా పరిణమించింది.

ప్రతిరాత్రి ఊరంతా గాఢనిద్రలో మునిగిన వేళ తనకు మెలుకువ వస్తుంది. పగలు అతి స్వల్పంగా, మామూలుగా కనిపించిన కుర్చీ, టేబిలు, అలమార, టేబిల్ లైటు, టెన్నిస్ రాకెట్, పాంట్లు, చొక్కాలు—అవే, రాత్రి చీకట్లో ఊపిరి పోసుకుని వెర్రిగా వికటంగా నవ్వుతూ తన చుట్టూ నాట్యం చేసేవి. పైన దూలాలు క్రిందికి దిగుతున్నట్టు, కిటికీలు, తలుపులు, చుట్టూ గోడలు దగ్గరగా జరుగుతున్నట్టు, తనను విడని ఉక్కు కౌగిలిలో బిగిస్తున్నట్టు— ఏమిటో అర్థంలేని వింత అనుమానాలు, భయాలు!

తలుపు తీసుకుని, బయటికి కుర్చీ లాక్కుని మొక్కల మధ్య వాలిపోయేవాడు. కొండలు,


## ఇంకా పొడుగు ఎదగండి



మా నూతన వ్యాయామాలు ఆహార నియామాల క్రమం అనుసరించి ఇతోధికమైన ఆరోగ్యం కూడా చేకూర్చుకోండి. స్త్రీ పురుషుల ఉభయులకూ అనుకూలమైనది. వివరములు ఉచితంగా పొందవచ్చును.

TOTAL HEALTH
Azad Market (A.P.V.)
Delhi-6.

## వధువు కావలెను

30 ఏళ్ళ బ్రాహ్మణ, వైదిక (కౌశిక సగోత్రం) యువకునికి ద్వితీయవివాహమునకు బాగా చదువుకొన్న (ఉద్యోగము చేస్తున్నా, చేయకపోయినా ఫరవాలేదు) స్థితిపరురాలైన అమ్మాయి కావలెను. ఇతరశాఖలవారు కూడా వ్రాయవచ్చును. వెంటనే పూర్తి వివరాలు ఫోటోతోసహా కేరాఫ్ బాక్సు నెం. 453 W, ఆంధ్రప్రభ, మద్రాసు—2 కు వ్రాయవలెను.

అమ్మకమునకు సిద్ధముగానున్నవి.

## ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్

V.G.S. గోల్డెన్ గైడు రూ 3-00
పోస్టేజి రూ. 1-00 అదనం.

**V. G. S. పబ్లిషర్సు,**
అమలాపురం తూ॥ గో॥ జిల్లా.

## వాయిదాలమీద గడియారాలు

సులభమైన వాయిదాల పద్ధతిని రిస్కు లేకుండా అదనపు ఖర్చు లేకుండా ప్రపంచ ప్రసిద్ధమైన, ఖరీదైన గడియారాలు పొందండి.

ఉచిత కేటలాగ్ కొరకు వ్రాయండి :

INDO TRADING CORPORATION,
289-91, Nagdevi Street,
Bombay-3.

మొక్కలు, నక్షత్రాలు, అన్నీ తన దైన్యాన్ని చూసి హేళనగా నవ్వుతున్నట్టనిపించేది. కాని, గదిలో చీకట్ల మధ్య మంచం మీద ఒక్కడూ, భయపెట్టే దూలాల్ని చూస్తూ గుటకలు మింగ డం కన్నా అలా బయట ఆలోచించుకుంటూ రాత్రంతా గడిపేయడం ఎంతో హాయి.

ఏమిటి తన లోపం?

ఆ ప్రశ్నకు సమాధానం తనకే తట్టింది కొన్నాళ్ళకు. ఒంటరితనం! దానికి విరుగుడు ఇంకొకర్ని తెచ్చుకోడం. ఈ సూక్ష్మం తెలిశాక సుశీల కనిపించింది. సుశీల ఎవరు అన్నది అనవసరం. ఆమె జీవితంతో తనకు సంబంధం లేదు. నౌకరు, హోటలు, బస్సు వగైరా అన్నిటిలాగే తన తాత్కాలిక అవసరాలు తీర్చడానికి ఆమె ఒకతె. తను ప్రయాణించిన బస్సు తనది కాదు; అదంటే ఈ రెలాంటి వ్యామోహమూ లేదు. దూరం నడవ లేని తన అశక్తతను, బలహీనతను బస్ తీర్చింది.

తను తాత్కాలికంగా అనుభవించిన లోటును సుశీల భర్తీ చేసింది. అంతకన్నా ఆమె తన కేం కాదు.

"ఇన్నాళ్ళయాక ఇంకా ఎందుకు వెనకాల తిరగడం?" నీరజ అడిగింది కాసేపాగి.

"అదే నాకూ అర్థం కాదు. డబ్బు కావాలేమో? బహుశా మన సంబంధాన్ని సరిగ్గా అర్థం చేసుకు నుండదు. ఏమయినా ఆమె ఎందు కొచ్చిందో, ఆమె కేం కావాలో అదంతా నా కనవసరం. ఆరోజుల్ని, మనుషుల్ని మరిచిపోయి చాలాకాలమయింది. నీ కంతా ఏమీ దాచకుండా చెప్పేశాను, నీరూ. నా వెనుక ఈ మచ్చని నీ నుంచి దాచాలని కాదుగాని నీకు తెలిసినందువల్ల ఒరిగేదేం లేదనే భావంతోనే ఇక్కడికి రాకూడదని అనుకున్నాను! మన స్నేహం అమృతం లాంటిది. పాలల్లో విషపు చుక్క విద పాలని ఎవరి కుంటుంది? కాని, జరిగింది ఇంకొకటి. ఇంతకీ నేను భయపడ్డానికి ఏంలేదు. నా పరిస్థితి ఎలాంటిదో సాధ్యమైనంత స్పష్టంగా చెప్పాను. మిగతావాళ్ళు ఎవరన్నా ఆ పరిస్థితుల్లో ఎలా చేసే వారో నాకు తెలియదు. కాని, నా కంతకన్నా ఇంకో మార్గం తోచలేదు. నీరూ, నన్ను క్షమించగలవా? నా మనసులో భావాన్ని సరిగ్గా వ్యక్తం చేయలేక పోయానేమో? అయినా అర్థం చేసుకోగల విశాల హృదయం నీ కుందని తెలుసు."

# క్షంతవ్యాలు

"పన్నెండు కావస్తోంది. నెమ్మదిగా బయ ల్దేరదామా?" అంటూనే నీరజ లేచింది.

తిరిగి రెస్ట్ హౌస్ చేరుకునే వరకూ ఇద్దరూ ఏం మాట్లాడలేదు. ఆ సాయంకాలం వరకూ మాట లేం జరగలేదనే చెప్పాలి. ఆమె ఆలోచనలకు భంగం రానియ్యడం అతని కిష్టం లేదు. ఆమెను తొందరజేసి తను సాధించేదేమీ ఉండదు. ప్రశాంతంగా ఆలోచిస్తే, తను ఏ పరిస్థితుల్లో అలా ప్రవ ర్తించవలసి వచ్చిందో ఆమె అర్థం చేసుకోగలిగితే తనను తప్పక క్షమించగలదన్న విశ్వాసం అతని కుంది.

రాత్రి మామూలుగా ఆరుబయట కూర్చు న్నప్పుడు మెల్లిగా అడిగింది నీరజ.

"మాచర్లలో రైళ్ళెప్పుడెప్పుడున్నాయో?"

కృష్ణ గుండెలో మంచుముద్ద చేరిన ట్టయింది.

"ఏం?"

నీరజ కాసేపు మాట్లాడలేదు.

"మనం ప్రస్తుతానికి ఈ ట్రిప్ ముగిం చేద్దాం."

"కాని, మాచర్లెందుకు? హైదరాబాద్ రా."

"నన్ను వెళ్ళిపోనివ్వండి."

"సెలవు పది రోజులు పెట్టావన్నావుగా?"

"సెలవుకేం? కాన్సిల్ చేసుకోవచ్చు."

"కాన్సిల్ చేసుకోడ మెందుకొచ్చింది?"

ఇద్దరి మధ్యా కొద్దిసేపు నిశ్శబ్దం పేరుకుంది. ఆ తర్వాత కృష్ణ మెల్లిగా మొదలుపెట్టాడు.

"నన్ను దగా చెయ్యకు, నీరూ. నీ చుట్టూ ఎన్నో ఆశలు, కలలు పేర్చుకున్నాను. వాటన్నిటినీ అలా పదిలపరుచుకోవాలని, నిజాలుగా మార్చుకోవా లని ఎంతగానో ఎదురు చూశాను. చివరికి నా వెనక ఓ మచ్చ దాగి ఉందని తెలిసి కూడా నీ ఎదుట దాచడం ఇష్టంలేక ఇక్కడికి తీసుకువచ్చి అంతా తెలియజేసింది, నన్ను మన్నించగలవని ఆశతోనే! ఆ మాత్రం నన్నర్థం చేసుకోలేవా?"

"నాలో బాధ మీ కెలా చెప్పమంటారు? ప్రొద్దున్నుంచి నాలో ఈ సంఘటనే మెదులు తోంది. ఏదీ ఎటూ తేలదు. అంతాఅయోమయం. మీరు చేసిన పాపం, నేరం ఏం లేదు! కాని, నాలో ఏమిటో అసంతృప్తి, బాధ! ఈ రెంటి మధ్య నలిగిపోయే నాకు ప్రశాంతి కావాలి. దయచేసి నన్ను వెళ్ళిపోనివ్వండి. కొన్నాళ్ళు దూరంగా ఉండి ఆలోచిస్తే నేను మనిద్దరికీ ఇష్టమైన పరిష్కా రానికి రాగలనేమో? నా పరిస్థితి అర్థం చేసుకోడా నికి ప్రయత్నించండి. నే నెంత మథనపడు తున్నానో మీకు తెలుసు."

ఆ తర్వాత కృష్ణ మాట్లాడలేదు.

మర్నాడు మధ్యాహ్నం. మాచర్ల స్టేషను. ప్లాట్‌ఫారంమీద అతను నిలబడ్డాడు. ఆమె కిటికీ వార కూర్చుంది. ఇద్దరూ నేరస్థుల్లా ఒకర్ని ఒకరు తప్పించి చూస్తున్నారు. గంట మోగింది.

ఉన్నట్టుండి అకస్మాత్తుగా అతను ఆమెకేసి సూటిగా చూసి అడిగాడు:

"నే నంటే ఇదివరకటి అభిమానం ఇప్పు డుందా నీకు?"

"అంతకన్నా ఎన్నో రెట్లు ఎక్కువైంది."

బండి కదిలింది. అతను గిరుక్కున వెనక్కు తిరిగి ఆమెనుంచి మొగం చాటు చేసుకొని బయ టికి వెళ్ళిపోయాడు. ఆమె చుట్టూ మనుష్యు ల్నించి మొహం చాటుచేసుకుని వెక్కివెక్కిఏడ్చింది.

ఆ తర్వాత మరో నెలకు కృష్ణ, నీరజనుంచి ఒక ఉత్తరం అందుకున్నాడు.

"ఈనెల అంతా నాలో రేగిన దుమారం మీకు తెలియజెయ్యాలంటే చాలినన్ని మాటలు లేవు. గతాన్ని మరిచిపోవాలని, మన మధ్య మధురమైన బంధాన్ని మరింత దృఢం చేసుకోవాలని, ఇన్నాళ్ళ మన కలలు నిజం చేసుకోవాలని ఎంతగానో ప్రయ త్నించాను. మీ పరిస్థితి నా కర్థమవుతుంది. బహుశా మీ పరిస్థితిలో ఎవరున్నా అలానే చేసే వారేమో? అందుమూలంగా మీమీద అభి మానం తగ్గిందని భావించకండి. నిజం చెప్పాలంటే మీ నిజాయితీని తలుచుకుంటే నాకు చెప్పలేని గౌరవం కలుగుతూంది. మీరు నేరం చేసినట్టు, నేను శిక్షిస్తున్నట్టు కలలోకూడా ఊహించలేను. దయచేసి ఎన్నడూ అలా భావించకండి. కాని, మీమీద అభిమానం, గౌరవం, పెంచుకున్న స్నేహితురాలుగా ఉండడానికి, మీభార్యగా మీతో కాపురం చెయ్యడానికి తేడా ఉందేమో? నా మనస్సులో భావాన్ని సరిగ్గా వ్యక్తం చేయలేక పోతున్నాను. అర్థం చేసుకోడానికి ప్రయత్నించండి. మీరు నా దగ్గరికి వచ్చినప్పుడల్లా ఆమె మనిద్దరి మధ్యా నిలిచిన ట్టవుతుంది. ఆ నల్ల పెదాలను అద్దిన పెదాలు నన్ను స్పృశిస్తాయని, ఆమెను పెనవేసుకున్న చేతులే నన్ను బంధిస్తా యని—అదంతా తలుచుకుంటే భరించలేని జుగుప్స కలుగుతూంది. ఆమె ఇలా నన్ను నీడలా వెంటాడుతూంటే, ఈ రోత, నరకం ఎన్నాళ్ళని భరించగలను? బహుశా నా మనసు మామూలుగా అందరూ సహించగలవాటినే సహించలేకపోతుం దేమో? ఏమయినా అశక్తురాలిని. మిమ్మల్ని బాధ పెట్టి ఉంటాను. దానికి నన్ను నేను నిందించు కోడంకన్నాచేయగలిగింది లేదు. క్షమించండి." ★

# జోగ్ జలపాతం

(35 వ పేజీ తరువాయి)

తక్కువగా ఉంటుందనీ హాయిగా ఆ ప్రకృతి సౌంద ర్యాన్ని నిరాటంకంగా మేమే అనుభవించవచ్చనీ జోగ్‌కు సెప్టెంబరులో బయలుదేరాము. ప్రతి సంవత్సరం సెప్టెంబరు సమీపించేసరికి వర్షాలు తగ్గేవట. ఈ సంవత్సరం ఇప్పటికీ వర్షాలు పడుతూనే ఉన్నవి. షిమోగానుండి బస్సులో బయలుదేరి నాలుగు గంటల తర్వాత జోగ్ చేరాము. త్రోవంతా కొండ గుట్టలూ, అడవి ఆకర్షణీయంగా ఉన్నవి. జోగ్‌కు చేరుతూనే ఒకటే ఆత్రుత—జలపాతం ఎక్కడ? ఇంకా కనిపించదే! బస్ ఆగిన వెంటనే మొదట జలపాతాన్ని చూచాక ఆ తరువాత సౌపానులవైపు దృష్టి మళ్ళింది. జోగ్ పరిసర ప్రదేశాలు పచ్చగా పచ్చిక కంబళిని కప్పుకొని అందంగా కనిపిస్తాయి. ఆ కొండ దిగువ ప్రాంతాలలో తీర్చికట్టిన ఇళ్ళు అందంగా హిల్ స్టేషన్సను గుర్తుకు తెస్తాయి.

శరావతి నీటిని పైనుండి వేరే కాలువద్వారా మరొక గుట్టమీదకు ప్రవహింపచేసి అక్కడ విదు చ్ఛక్తిని ఉత్పత్తి చేస్తారు. దానినే 'మహాత్మా గాంధీ ఎలెక్ట్రిక్ వర్క్స్' అంటారు. ఈ గుట్టపైనుండ్యే ట్రాలీలో క్రిందిలోయలోనికి దిగుతూ ఉంటే తమా షాగా ఉంటుంది. ప్రతి నిమిషమూ క్రిందకు పడి పోతామనే భయం మనస్సును ఆవరిస్తుంది. ★